## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**గోపాలపట్నం:** గోపాలపట్నంలో ఎల్‌టీ లైన్ రీప్లేస్‌మెంట్ పనులు ఉన్నందున శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలీకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం పరిధి లక్ష్మీనగర్, నరసింహనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### పోరాట యోధుడు భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**సింధియా:** జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలోని భగత్‌సింగ్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ముఖ్య అతిథి సీనియర్ కామ్రేడ్ సూరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ వీరోచిత పోరాటాన్ని కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, రామకృష్ణ, కనకేశ్వరరావు, రాము, కామేశ్వరరావు, వీర్రామమూర్తి, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

### 27న మార్కెట్లకు వేలం పాట

**జగదాంబ:** జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయంలో ఈనెల 27న వివిధ మార్కెట్లకు సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధి 12 వార్డుల్లో ఉన్న మార్కెట్లు, జీవీఎంసీ దుకాణాలు, కళ్యాణ మండపాలు, పార్కుల ప్రవేశ రుసుములు, చెట్ల ఫలసాయానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 1 నుంచి 2024 మార్చి 31 వరకు గుత్తేదారుకు ఇచ్చే విషయమై వేలం వేయడానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ఈనెల 27 ఉదయం 11 గంటలకు జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయంలో హాజరు కావాలని జెడ్సీ కోరారు.

### లలితా పీఠంలో రాజశ్యామల హోమం

**సీతంపేట:** వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా రాజశ్యామల హోమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు షోడశ మహామంత్ర హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

### బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

**అగనంపూడి:** ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన 25వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ కళాశాల విద్యార్థి ఎస్.షణ్ముఖవెంకటసునీల్ నాలుగో స్థానంలో నిలిచాడు. అతడిని కళాశాల రెక్టార్ డాక్టర్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ అరుంధతి అభినందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు సీహెచ్.రాంబాబు, జి.ప్రశాంత్, డాక్టర్ పి.ఎస్.వి.రమణ, ఎ.భారతి పాల్గొన్నారు.



# మరుగుకు తప్పని అవస్థలు



ఎన్‌ఏడీ జంక్షన్ అంబేద్కర్ నగర్ వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నిర్మించిన మరుగుదొడ్లు



గాజువాక వెళ్లే పాత బస్టాప్ వద్ద మూత పడిన మరుగుదొడ్లు

- ఎన్‌ఏడీ జంక్షన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు
- మహిళల కోసమైనా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్



శిథిలావస్థలో మరుగుదొడ్లు

**గోపాలపట్నం:** ఎన్‌ఏడీ జంక్షన్ ఇటీవల బాగా అభివృద్ధి చెందింది. రూ. 150 కోట్లతో ప్రత్యేక డిజైన్‌తో బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అయితే ఇక్కడి ప్రయాణికులు, ప్రజల సౌకర్యాలను మాత్రం అధికారులు, నాయకులు విడిచి పెట్టేశారు. గతంలో ఎన్‌ఏడీ జంక్షన్ నాలుగు రోడ్లలో మూడు వైపులా మరుగుదొడ్లను స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్మించారు. అయితే ఇది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. నిర్మాణమైతే చేశారు కానీ సరైన రీతిలో నిర్వహణ చేయకపోవడంతో అవి కాస్త మూలన పడ్డాయి. గాజువాక వైపు వెళ్లే రహదారిలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సంస్థ నిర్మించిన కంటైనర్ మరుగుదొడ్లు మాత్రం కాస్త ఉపయోగకరంగా ఉన్నాయి. అయితే అవి కూడా ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదిలా ఉంటే మరుగు దొడ్ల నుంచి వచ్చే మురుగు నీరు దిగువన ఉన్న గణేష్‌నగర్‌లోని ఇళ్లలోకి వెళ్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కల్పించాలని ఇక్కడి వారు కోరుతున్నారు.

**ఆర్టీసీ బస్‌స్టాప్ వద్ద..**

అంబేద్కర్‌నగర్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాప్‌కు సమీపంలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇవి నిర్మాణం చేపట్టిన నాటి నుంచే ఈ పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ మరుగు దొడ్లను శుభ్రపరిచే వారు లేక ఈ పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పుడు కొత్తగా బస్టాప్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం వేచి ఉంటారు. వారు మరుగు కోసం అవస్థలు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కనీసం పాత మరుగు దొడ్లనైనా బాగు చేసి అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించే విధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## సీతారాముల కల్యాణానికి పందిరి రాట



పందిరి రాట వేస్తున్న భోగవల్లి దంపతులు

**మల్కాపురం:** చైత్ర శుద్ధ నవమి సందర్భంగా ఈ నెల 30న సీతారాముల కల్యాణం జరపనున్న నేపథ్యంలో 61వ వార్డు మల్కాపురంలోని నగరాల వీధిలో గల రామాలయం వద్ద గురువారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధి, జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం దంపతులు పాల్గొని స్వామి వారి రాట వేశారు. ఈ సందర్భంగా భోగవల్లి మాట్లాడుతూ సీతారాముల కల్యాణం ప్రతి ఏటా జరుపుతున్నామన్నారు. పూజలు, అన్నసమారాధన, కోలాటం, లలితా పారాయణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**పల్లి వీధిలో..**

ఇదే వార్డు పల్లి వీధిలోని సీతారాముల కల్యాణాన్ని స్థానిక విజయబాల మిత్ర కళా సంఘం ప్రతినిధులు ఈ నెల 29 నుండి ఏప్రిల్ 1 వరకు ఇక్కడి రామాలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత పూజలు, మంగళ హారతి కార్యక్రమాలతో పాటు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

## అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు



సింహగిరిపై గిరిజన పూజారులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామాల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే గురువారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అల్లూరి జిల్లాలోని ఆలయాల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## స్ఫూర్తిప్రదాత పిళ్లా రామారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

**సీతంపేట:** విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు పిళ్లా రామారావు సంస్మరణ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ శాంతం, దరహాసం, ఓర్పు, సహనం, వినయం గల మహామనిషి అని కొనియాడారు. ప్రముఖ విద్యావేత్తగా, సేవా ప్రముఖుడిగా వినతికెక్కిన వ్యక్తని, ఎందరికో రామారావు స్ఫూర్తినిచ్చారని ప్రశంసించారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిగా రామారావు వద్ద భౌతిక శాస్త్రం నేర్చుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. సభాధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్, ప్రయాగ మురళీమోహన్, ఏవీఎన్ శెట్టి, ఆచార్య పి.సోమరాజు, రచయిత డి.వి.సూర్యారావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, తదితరులు పిళ్లా రామారావుతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిళ్లా రమణమూర్తి, డాక్టర్ జి.ప్రభాకర్, ద్వారం త్యాగరాజు శిష్య బృందం పాల్గొన్నారు.

## సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు క్షీరాభిషేక సేవ..**

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

## 'కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తూ, కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 770వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులతో పాటు దేశంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండి ఎదుర్కోవాలని కోరారు. దేశంలోని సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాల ప్రదానం



డాక్టర్ నవీన్‌కుమార్‌కు పురస్కారం అందజేస్తున్న స్టీల్‌క్లబ్ ప్రతినిధులు

**ఉక్కునగరం:** వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. స్థానిక స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ.పి. నవీన్ కుమార్, డాక్టర్ జి. సుజాత, ఉక్కు అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, అథ్లెట్ వరలక్ష్మి, వాలీబాల్ క్రీడాకారులు ఎం. మురళీమోహన్‌లకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కవులు ఉగాది కవితలను వినిపించారు. కార్యక్రమంలో భాగంగా 10 మంది కవులను సత్కరించారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ పీపీఎం విభాగం జీఎం డాక్టర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ప్రముఖ పండితులు అద్దంకి రాఘవాచార్యులు పంచాంగం వినిపించారు. కార్యక్రమంలో స్టీల్‌క్లబ్ కార్యదర్శి నారాయణ దొర, సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం



విజేతలతో సినీ నటుడు సుమన్ తదితరులు

**గాజువాక:** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను కూడా నేర్పించాలని సినీ నటుడు, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ అన్నారు. గాజువాక బీసీ రోడ్‌లోని బ్యూలా స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విజేతలకు గురువారం ఆయన పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలు సాధన చేసే విద్యార్థులు చదువులో కూడా రాణిస్తారన్నారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు, రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు, బ్యూలా స్కూల్ ప్రిన్సిపాల్ గిరి, కరాటే సంఘం సభ్యులు సతీష్ కుమార్, అంగా రాము, శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


## సాయినాథునికి వెండి బిందె, కలశం బహూకరణ



ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావుకు వెండి బిందె, కలశం అందజేస్తున్న దాతలు

**పెదగంట్యాడ:** స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో కొలువైన సాయినాథునికి వెండి బిందె, కలశాన్ని బహూకరించారు. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీకి చెందిన మాణిక్యాల శ్రీనివాసరావు, ఇందిరారాణి దంపతులు రూ.ఒక లక్షా రెండు వేల విలువైన కిలో వెండి బిందె, 401 గ్రాముల కలశాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో వీజీకే రెడ్డి, డీఎల్ రెడ్డి, కె.సత్యంబాబు, పైల రామారావు, సీహెచ్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నూకాంబిక అమ్మవారి జాతర



కొలువుదీరిన నూకాంబిక అమ్మవారు

**మల్కాపురం:** జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్నాయి. ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు మందిరాన్ని సుందరంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి శాంతి స్నానాలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. తొలిరోజు పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ పాల్గొని అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేస్తారు. శనివారం మహిళలచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లలితా పారాయణ, కోలాటం జరుగుతాయి. ఆదివారం ముగింపు రోజు ప్రత్యేక పూజలు, అమ్మవారి ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ముఖ్యంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సినీ డూప్ రికార్డింగ్ డ్యాన్స్, సేవ గరిడీ, డప్పుల కార్యక్రమాలు అలరించనున్నాయి. అమ్మవారి జాతరలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తల్లిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

## పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్



ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద ఆటోలను ఆపి పరిశీలిస్తున్న సీఐ మళ్ల అప్పారావు

**గోపాలపట్నం:** ఆటోలపై ఉన్న పెండింగ్ చలానాలు వసూలు చేసేందుకు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎన్‌ఏడీ జంక్షన్ దిగువ సర్కిల్ వద్ద ఆటోలను ఆపి ఎన్ని జరిమానాలు పెండింగ్ ఉన్నదీ.. అవి ఎంత అని పరిశీలించి వసూలు చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ విధమైన తనిఖీలు ప్రతి రోజూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇంత వరకు ఈ ఫైన్లపై ఉదాసీనంగా ఉన్న పోలీసులు ఇప్పుడు ఉక్కు పాదం మోపారు. భారీ స్థాయిలో ఈ ఫైన్లు ఉంటాయని ఆటో డ్రైవర్లే చెబుతుండటం విశేషం.

**పబ్లిక్ డిమాండ్**

## సైన్ బోర్డు తొలగించండి



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సైన్ బోర్డు



ప్రమాదకరంగా ఉన్న దిమ్మ

**గోపాలపట్నం:** జాతీయ రహదారిపై గతంలో నిర్మించిన సైన్‌బోర్డు ప్రమాదకరంగా మారింది. పట్టణాల పేర్లు, దూరాలను తెలిపేందుకు గతంలో దాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఈ రహదారిని విస్తరించారు. దీంతో సైన్‌బోర్డుకు చెందిన ఒక వైపు దిమ్మ రోడ్డు మధ్యగా వచ్చింది. ఇది ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి సమయంలో ఈ దిమ్మను ఢీకొట్టే ప్రమాదముందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని తొలగించాలని అందరూ కోరుతున్నారు.

## బీసీల సభ జయప్రదానికి పిలుపు



సంఘీభావం తెలుపుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**సీతంపేట:** బీసీల డిమాండ్ల సాధనకు ఈ నెల 25న రాజమహేంద్రవరంలో తలపెట్టిన 'హలో బీసీ-ఛలో రాజమహేంద్రవరం' సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జన గణనలో కుల గణన జరగాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్‌లో బీసీల మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొని బీసీల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఈ ఐదు డిమాండ్ల సాధనకు రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద శ్రీవెంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో జరిగే సభకు బీసీలందరూ హాజరై విజయవంతం చేయాలని నరేష్ యాదవ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పిళ్లా నివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ ఇన్‌చార్జి పిళ్ల దినేష్‌కృష్ణ, రాష్ట్ర స్టూడెంట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి చిన్ని కిషోర్ యాదవ్, జిల్లా మహిళాధ్యక్షురాలు సత్యలత, నరేష్, కలపర్తి లక్ష్మి, ఆన చంద్రప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు.

## నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం



సుమూహుర్త ఘట్టం నిర్వహిస్తున్న గురుస్వామి



భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణంలో పాల్గొన్న పద్మశాలి దంపతులు

**సీతంపేట:** పద్మశాలీల కులదైవం, సృష్టికే వస్త్ర నిర్మాణ ప్రదాతైన భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం సీతంపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక దుర్గాగణపతి ఆలయం వెనుక వీధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది పద్మశాలి దంపతులు కల్యాణాన్ని తిలకించి తరించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయ గురుస్వామి మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. సుమూహూర్తం, మాంగల్య ధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. కల్యాణంలో ప్రతి ఘట్టం విశిష్టత, అందులో దాగి ఉన్న ఆంతర్యాలను భక్తులకు వివరించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిచ్చిన పద్మశాలి కులస్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలతో సీతంపేట పురవీధుల్లో భద్రావతి సమేత భావనారుషి స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులిచ్చి స్వామికి నీరాజనాలు సమర్పించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ స్వామివారిని దర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుదే రాజు, ఉపాధ్యక్షుడు బేత అప్పాజీ, కార్యదర్శి వానపల్లి లక్ష్మణ్‌కుమార్, కోశాధికారి దొడ్డి వాసు, పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో స్టీల్‌ప్లాంట్ అధికారుల నిరసన



స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న అధికారులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ అధికారులు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉక్కు అధికారుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆందోళన బాట పట్టింది. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు నల్లబ్యాడ్జీలతో విధులను నిర్వర్తించనున్నారు. వివిధ విభాగాల్లోని సీ ప్రతినిధుల నేతృత్వంలో ప్లాంట్‌లోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు బ్యాడ్జీలు ధరించారు. పదోన్నతులను వెంటనే రిలీజ్ చేయాలని, 2021-22కు సంబంధించి పీఆర్పీ చెల్లించాలని, మూడో వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్ర వెంకటేశ్వరరావు తదితరులు ఆయా విభాగాల్లో పర్యటించి, నిరసనల్లో పాల్గొన్నారు.